క్లుప్తంగా

జానపద కళలను ప్రోత్సహించాలి



తోలుబొమ్మలాటను ప్రదర్శిస్తున్న జానపద కళాకారులు

కాకినాడ రూరల్: దేశ సంస్కృతిలో భాగమైన జానపద కళలను ప్రోత్సహించాలని జానపద గాయకుడు, శ్రీనటరాజ నిలయ అధ్యక్షులు టి.పవన్‌కుమార్ అన్నారు. స్థానిక రమణయ్యపేటలో ప్రపంచ జానపద కళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జానపద సాహిత్యం భారతీయులకు ఎంతో గర్వకారణమన్నారు. కొన్నేళ్లుగా ప్రాచీన జానపద కళారూపాలైన తోలుబొమ్మలాట, హరికథలు, బుర్రకథలు, జానపద నాట్యం ఇలా అనేక కళలను తెలుగు రాష్ట్రాల్లో ప్రదర్శనలు ఇచ్చామన్నారు. అనంతరం జానపద గేయాలను ఆలపించి, తోలుబొమ్మలాట ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాకారులను ఘనంగా సత్కరించారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



కరపలో పేదలకు నిత్యావసరాలు అందజేస్తున్న డాక్టర్ సూర్యారావు

కరప: పంచాయతీ కార్మికులు, పేదలు సుమారు 30 మందికి స్థానిక దుర్గాదేవి ఆలయం వద్ద శుక్రవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఎముకల వ్యాధి నిపుణుడు డాక్టర్ బొండా సూర్యారావు కేక్ కట్ చేసి, నిత్యావసరాల కిట్లను అందజేశారు. కరప డీసీ చైర్మన్ పీజీ సత్యనారాయణ, కరప, వేములవాడ పీఏసీఎస్ చైర్మన్లు ఎస్.భీమశంకర్, దూడల నారాయుడు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రెడ్‌క్రాస్ శిబిరానికి 'ఆదిత్య' విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ నాయుడు

బాలాజీచెరువు: రెడ్‌క్రాస్ సంస్థ నిర్వహించే జాతీయ స్థాయి శిబిరానికి ఆదిత్య విద్యార్థులు ఎం.రాహుల్‌కుమార్, వి.సంతోష్‌కుమార్ ఎంపికయ్యారు. హర్యానా రాష్ట్రంలోని కురుక్షేత్రలో శుక్రవారం నుంచి 28వ తేదీ వరకూ జాతీయస్థాయి శిబిరం నిర్వహిస్తున్నారని, కళాశాల యూత్ రెడ్‌కల్చర్ వలంటీర్ వింగ్ నుంచి ఎంపిక కావడం సంతోషంగా ఉందని కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం తన చాంబర్‌లో విద్యార్థులను ఆయనతో పాటు, పీవో తేజేశ్వరరావు అభినందించారు.

గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సమావేశం



వినతిపత్రం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

బాలాజీచెరువు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘ సమావేశం శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ఎస్‌హెచ్‌కే వర్మ మాట్లాడుతూ, అర్హత ఉన్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. పాఠకులకు అనుకూలంగా గ్రంథాలయ పనివేళలు మార్చాలన్నారు. మూడేళ్లకు పైగా ఉన్న పాత పత్రికలను అమ్మేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రంథాలయ సంస్థ అధికారులకు వినతిపత్రం అందజేశారు. సంఘ ప్రతినిధులు సలాది సాయిసత్యనారాయణ, డొక్కా రాజు, రేపాక వెంకటరాము, కిషోర్, ములంపాక శ్రీనివాసరావు, సలాది రాజు పాల్గొన్నారు.

ఆలయంలో సౌకర్యాల కల్పన

కాకినాడ రూరల్: కొవ్వూరు వారాహి అమ్మవారి ఆలయ నిర్వహణ బాధ్యతను దేవదాయ శాఖకు అప్పగిస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చినట్టు సింగిల్ ట్రస్టీగా నియమితులైన పిఠాపురం శ్రీసంస్థానం ఈఓ సౌజన్య తెలిపారు. వారాహి ఆలయ విరాళాలు దుర్వినియోగం అవుతున్నాయని, సౌకర్యాలు లేవని ఫిర్యాదులు రావడంతో ఈ నెల 15న ప్రైవేట్ వ్యక్తుల నుంచి నిర్వహణ బాధ్యతను దేవదాయ శాఖ చేపట్టింది. నిర్వాహకురాలు హైకోర్టును ఆశ్రయించగా, ఆమెకు పూజా కార్యక్రమాలు నిర్వహించుకునే అవకాశం కల్పించి, నిర్వహణ బాధ్యతను సింగిల్ ట్రస్టీకి అప్పగించింది. ఆలయంలో సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టామని, గుడి మూసేస్తున్నారంటూ వస్తున్న వదంతులను నమ్మవద్దని సింగిల్ ట్రస్టీ సౌజన్య తెలిపారు.

గణపయ్య.. జీవనాధారం నీవేనయ్య..!

- విగ్రహాల తయారీనే నమ్ముకున్న కళాకారులు
- స్థానికులతో పాటు, ఇతర ప్రాంతాల నుంచి రాక
- ట్రెండ్‌కు తగ్గట్టు రూపుదిద్దుకుంటున్న కళాఖండాలు
- ఐదు రోజుల్లో నవరాత్ర ఉత్సవాలు



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన వినాయక విగ్రహాలు



విగ్రహాలకు రంగులు అద్దుతున్న కళాకారులు

కాకినాడ సిటీ: వినాయక చవితి సందడి మరో ఐదు రోజుల్లో మొదలుకానుంది. భాద్రపద శుక్లపక్ష చవితి నాడు ప్రారంభమై.. ఎంతో వైభవంగా జరుపుకొనే నవరాత్ర ఉత్సవం ఈ నెల 27న ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో కళాకారులు గణేష్ విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్నారు. ఏడాదికి ఒకసారి వచ్చే వినాయక చవితి ఉత్సవాలకు అవసరమైన బొజ్జ గణపయ్య విగ్రహాలను కళాకారులు తయారు చేసి, ఏడాదికి సరిపడా ఆదాయాన్ని ఆర్జించి కుటుంబాన్ని పోషిస్తుంటారు. ప్రధానంగా ఈ సీజన్‌లో రాజస్థాన్, కోల్‌కతా, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాలకు చెందిన కళాకారులు విగ్రహాల తయారీలో నిమగ్నమయ్యారు.

40కి పైగా తయారీ కేంద్రాలు

కాకినాడ రూరల్, అర్బన్ నియోజకవర్గాల పరిధిలోని సర్పవరం, ఆటోనగర్, రమణయ్యపేట, అచ్చంపేట జంక్షన్, తూరంగి, జగన్నాథపురం, నడకుదురు, వేళంగి, తాళ్లరేవు, పెదపూడి తదితర ప్రాంతాల్లో రాజస్థానీ కళాకారులతో పాటు, స్థానికంగా ఉన్న కళాకారులు కూడా విగ్రహాలను తయారు చేస్తున్నారు. కాకినాడ రూరల్, సిటీ ప్రాంతాల్లో దాదాపుగా 40కి పైగా విగ్రహ తయారీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది కళాకారులు, వ్యాపారులు, కూలీలు ఉపాధి పొందుతున్నారు. ఉత్సవాలకు మూడు నెలల ముందు విగ్రహాల తయారీ కేంద్రాలను ఎంపిక చేసుకుని, అవసరమైన ముడి సామగ్రిని రూ.లక్షలు పెట్టి కొనుగోలు చేసుకుని నిల్వ పెట్టుకుంటారు. రెండు నెలల ముందు విగ్రహాలను తయారీ చేయడం ప్రారంభిస్తారు. ఉత్సవానికి సమయం దగ్గర పడటంతో విగ్రహాలకు తుది మెరుపులు దిద్దుతున్నారు.

ట్రెండింగ్‌కు అనుగుణంగా..

ఏటా ట్రెండింగ్‌లో ఉన్న వినాయక విగ్రహాలకు ఆదరణ పెరుగుతోంది. ఉత్సవ కమిటీ నిర్వాహకుల అభిరుచికి తగ్గట్టుగా రకరకాల ఆకృతుల్లో వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. రెండు నుంచి 12 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలను తయారీ చేసి, మార్కెట్‌లో విక్రయాలకు సిద్ధంగా ఉంచారు. విగ్రహాల మోడల్, సైజును బట్టి ఒక్కొక్క విగ్రహాన్ని రూ.రెండు వేల నుంచి రూ.20 వేల వరకు విక్రయిస్తున్నారు. కళాకారులు రూ.లక్షల పెట్టుబడి పెట్టి విగ్రహాలు తయారు చేస్తున్నారు. తాము ఆశించిన స్థాయిలో విగ్రహాలు అమ్ముడుపోతేనే తమ కుటుంబ పోషణకు భరోసా దొరుకుతుందని, లేదంటే నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని కళాకారులు చెబుతున్నారు.

ఇదే జీవనాధారం



తరతరాలుగా విగ్రహాలు తయారు చేస్తున్నాం. ఏటా మూడు నెలల ముందు నుంచే ఏర్పాట్లు సిద్ధం చేసుకుంటాం. ట్రెండింగ్‌కి తగ్గట్టుగానే మూడు అడుగుల విగ్రహం నుంచి 12 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలు అమ్ముడుపోతే ఆశించిన లాభాలు వస్తాయి. లేదంటే నష్టం భరించాలి.

– పరమేశ్, విగ్రహాల తయారీదారుడు, తూరంగి

అభిరుచికి తగ్గట్టుగా..



ఈ ఏడాది వినాయక విగ్రహాలు ముందుగానే బుకింగ్ అవుతున్నాయి. తయారైన విగ్రహాలను యువకులు చూసి, వారికి నచ్చిన దానిని బుక్ చేసుకుంటున్నారు. వారి కోరిక మేరకు విగ్రహాలకు రంగులు దిద్దుతున్నాం. అందరికీ ఆకర్షించేలా విగ్రహాలు మార్కెట్‌లోకి తీసుకువస్తున్నాం.

– జగదీశ్, రాజస్థానీ కళాకారుడు, నడకుదురు

ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సత్యనారాయణ

బాలాజీచెరువు: ఆరోగ్య సంరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని, నిర్లక్ష్యం వహించరాదని అలయన్స్ జిల్లా గవర్నర్ పెంకే గోవిందరాజు అన్నారు. అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ శరవణన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరాజు మాట్లాడుతూ, నేటికాలంలో వయస్సుతో సంబంధం లేకుండా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. ఆహార నియమాలతో పాటు, వ్యాయామం చేయడం అవసరమన్నారు. ప్రముఖ వైద్యులు, క్లబ్ ఫెసిలిటేటర్ డాక్టర్ డీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ, సమతుల్య ఆహారం తీసుకోవాలని, మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలని చెప్పారు. ముఖ్యంగా జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అవి ఆరోగ్యంతో పాటు, హృదయాన్నీ దెబ్బ తీస్తాయన్నారు. క్లబ్ చైర్మన్ దిలీప్‌కుమార్ సదనాని, ప్రతినిధులు కుడిపూడి వెంకటేశ్వరరావు, భాస్కరరావు, శ్రీలక్ష్మి, రామకృష్ణ, ఈశ్వరి పాల్గొన్నారు.

ధ్యాన్‌చంద్ చాంపియన్ షిప్ ప్రారంభం



ధ్యాన్‌చంద్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకుని, క్రీడల్లో రాణించాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు అన్నారు. ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శాప్ ఆదేశాల మేరకు జిల్లా క్రీడా మండలి ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ చాంపియన్ షిప్ పోటీలను శుక్రవారం డీఎస్ఏ మైదానంలో ప్రారంభించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా, శాప్ డైరెక్టర్ రవీంద్రనాథ్ గౌరవ అతిథిగా విచ్చేశారు. తొలుత క్రీడా మైదానంలోని ధ్యాన్‌చంద్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమానికి డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, క్రీడాకారులు మంచి ప్రతిభ కనబర్చి తమ జిల్లాలకు మంచి పేరు తేవాలన్నారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ, క్రీడల్లో జయాపజయాలు సహజమని, క్రీడాస్ఫూర్తి ప్రధానమన్నారు. క్రీడాకారులు క్రీడా వందనం సమర్పించారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఎల్.జార్జి, పీడీలు బంగార్రాజు, రవిరాజు, సుబ్రహ్మణ్యం, డీఎస్ఏ కోచ్‌లు సతీష్‌కుమార్, సమీర్, రుద్ర, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పొదుపు ఆవిష్కరణపై అవగాహన



సదస్సుకు హాజరైన వ్యాపారులు, ట్రేడ్ యూనియన్ సభ్యులు

బాలాజీచెరువు: ఐఐఎఫ్‌టీ(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్) ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ఓ హోటల్లో పొదుపు ఆవిష్కరణపై అవగాహన నిర్వహించారు. తక్కువ వనరులతో ఎక్కువ సామర్థ్యం ఉన్న వాటిని సృష్టించడం, స్థిరమైన వ్యాపార నమూనాలను నిర్మించడంలో స్మార్ట్ వనరుల వినియోగం తదితర అంశాలపై ఐఐఎఫ్‌టీ ఫ్యాకల్టీ(మార్కెటింగ్) డాక్టర్ మిశ్రా వివరించారు. విద్యా పరిశోధనను పరిశ్రమల సాధనతో అనుసంధానం చేయడం వంటి వాటిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన 40 మంది వ్యాపార యాజమానులు, ట్రేడ్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రీన్ బిల్డింగ్స్‌తో బహుళ ప్రయోజనాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ హనుమంతరావు

బోట్‌క్లబ్: భవన నిర్మాణ రంగంలో వస్తున్న సాంకేతిక పరిణామాల్లో భాగంగా గ్రీన్ బిల్డింగ్ ఆలోచన ద్వారా బహుళ ప్రయోజనాలను అందించేందుకు ఆస్కారం ఉంటుందని సిమెంట్ అండ్ కాంక్రీట్ నేషనల్ కమిటీ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.హనుమంతరావు అన్నారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సమావేశం శుక్రవారం స్థానిక రోటరీ క్లబ్‌లో ప్రెసిడెంట్ డాక్టర్ గోపీనాథ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఇంపాక్ట్ ఆఫ్ గ్రీన్ బిల్డింగ్స్ ఆన్ ఎన్విరాన్‌మెంట్ అనే అంశంపై డాక్టర్ హనుమంతరావు ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు, సహజ వనరుల పరిరక్షణకు గ్రీన్ బిల్డింగ్స్ కాన్సెప్ట్ అవసరమన్నారు. ఈ నిర్మాణాల వల్ల విద్యుత్ ఆదాతో పాటు, నీటి పొదుపు, వాతావరణ కాలుష్యం కలిగించే వాటి నుంచి ప్రజలను, పర్యావరణాన్ని రక్షించడానికి ఆస్కారం ఉందన్నారు. సహజ వనరుల వినియోగం ద్వారా గ్రీన్ బిల్డింగ్స్ నిర్మాణానికి అధిక ప్రాధాన్యం తేవడమే కాక, వర్షపు నీటిని భద్రపరచడం, కార్బన్ డయాక్సైడ్ ఉత్పత్తి చేసే వాటి నుంచి కూడా భవన యజమానులను, తద్వారా సమాజాన్ని రక్షించడానికి అవకాశం ఉందన్నారు. భవిష్యత్తులో ఈ నిర్మాణ సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరం ఉంటుందని, దీనిని అనుసరించడానికి ప్రభుత్వాలు సైతం ధ్రువీకరించిన సంస్థల సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. రానున్న తరానికి ప్రస్తుత నిర్మాణాలతో మోయలేని భారం పెరగడమే కాక, అనేక సమస్యలను ఎదుర్కొనే పరిస్థితి ఉత్పన్నమవుతుందన్నారు. నేటి నుంచి గ్రీన్ బిల్డింగ్స్ కాన్సెప్ట్ వైపు దృష్టి మళ్లిస్తే, ఆరోగ్యంతో పాటు.. ఆదాయాన్ని పొందగలరన్నారు. క్లబ్ కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ సాన, కోశాధికారి ఉదయ చక్రవర్తి, సభ్యులు గోవిందరాజులు, లంక సాయిబాబు, టీఎస్ఎన్ రాజు, సత్తి రవిరెడ్డి, భూపేంద్ర, పద్ద రాజు పాల్గొన్నారు.

పెదమల్లాపురాన్ని మండలం చేయాలి

- డీఆర్వోకు సాధన కమిటీ వినతిపత్రం



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: జిల్లాలోని సబ్‌ప్లాన్ ప్రాంతంలో 12 పంచాయతీలు, 59 గిరిజన గ్రామాలను కలిపి గిరిజన మండలం చేయాలని కోరుతూ పెదమల్లాపురం మండల సాధన కమిటీ సభ్యులు శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావుకు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ, గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పెదమల్లాపురం మండలం చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఇప్పుడు నూతన మండలాలు, జిల్లాలు ఏర్పాటు చేయడానికి కమిటీ ఏర్పాటు చేసిన నేపథ్యంలో.. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దాపురం పర్యటనకు వస్తున్న సందర్భంగా పెదమల్లాపురాన్ని మండలంగా ప్రకటించాలని కోరారు. జనసేన అధినేత 2024 ఎన్నికలకు ముందు ఏలేశ్వరం సభలో ఈ మండలం ఏర్పాటుపై హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మండల సాధన కమిటీ నాయకులు జర్త ముసలయ్య, భూసరి బాలరాజు మాట్లాడుతూ, గతంలో తమకు ఐటీడీఏ ఉండేదని, దాని ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు జరిగేవన్నారు. ఇప్పుడు ఐటీడీఏ లేకపోవడంతో 59 గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేక యువత వలస పోతున్నారన్నారు. మండలం ఏర్పాటు చేస్తే అధికారులు అన్ని చర్యలు చేపడతారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జర్త శ్రీను, నాగేశ్వరరావు, రమణ, లక్ష్మణ్, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి ఇవ్వకపోవడం దారుణం

- సీపీఎం జిల్లా నేత నీలపాల



సమావేశంలో మాట్లాడుతున్న నీలపాల సూరిబాబు

పెద్దాపురం: నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరిద్దామంటే.. ప్రజా సంఘాల నాయకులకు అనుమతి ఇవ్వకపోవడం దారుణమని సీపీఎం జిల్లా నాయకుడు నీలపాల సూరిబాబు మండిపడ్డారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మౌలిక సమస్యలపై సీఎం చంద్రబాబు దృష్టి సారించాలన్నారు. పట్టణంలో చంద్రబాబు హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలను ఇప్పటికీ పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు అందజేయలేదన్నారు. పెద్దాపురం ఏరియా హాస్పిటల్ వంద పడకల ఆసుపత్రిగా ఆయన హయాంలోనే ప్రతిపాదనలు మంజూరైతే, ఇప్పటికీ అది అమలు కాలేదన్నారు. రెండు జంట మున్సిపాలిటీల్లో పారిశుధ్య సిబ్బంది కొరత ఉందని, వారిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. నాలుగు నియోజకవర్గాల పరిధిలోని ఉన్న ఏలేరు ఆధునీకరణ పనులు తక్షణం ప్రారంభించాలన్నారు. పెద్దాపురం పర్యటనకు వచ్చి, వెళ్లిపోయేటట్టు కాకుండా.. పెద్దాపురం నియోజకవర్గానికి ఏం చేస్తున్నారో చెప్పి వెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సిరిపురపు శ్రీనివాస్, గరిగపాటి పెంటయ్య, నెక్కల నరసింహమూర్తి, చల్లా విశ్వనాథం, రొంగల వీర్రాజు, కూనిరెడ్డి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

వెలగని వీధి లైట్లతో ఇక్కట్లు

కాకినాడ లీగల్: వీధి లైట్లు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయంగా ఉందని వాపోతున్నారు. స్థానిక రామారావుపేట వేలమూరివారి వీధిలో రాత్రి సమయంలో చీకటిగా ఉండడంతో కొందరు బహిరంగంగా మద్యం సేవిస్తున్నారు. దీంతో రాత్రి సమయంలో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే కష్టంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. అదే వీధిలో ఇటీవల వాహనాల దొంగతనాలు జరిగాయని, టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు ఇచ్చామని స్థానికులు చెప్పారు. వీధి లైట్లు వెలగడం లేదని అనేక సార్లు కార్పొరేషన్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వీధి లైట్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు



దేవాలయం వీధిలోని భీమేశ్వరస్వామి ఆలయంలో..



సూర్యారావుపేట బాలాత్రిపుర సుందరి ఆలయంలో సామూహిక పూజల్లో పాల్గొన్న మహిళలు

బోట్‌క్లబ్: శ్రావణ శుక్రవారం సందర్భంగా నగరంలో పలు అమ్మవారి ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా నిర్వహించారు. ఉదయమే సామూహిక పూజల్లో పాల్గొనేందుకు మహిళలు తరలిరావడంతో ఆలయాలన్నీ కిక్కిరిశాయి. స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. సుమారు 1,300 మంది మహిళలు ఈ సామూహిక వ్రతాల్లో పాల్గొన్నారు. ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. పూజల్లో పాల్గొన్న మహిళలకు దాతల సహకారంతో చీర, పసుపు, గాజులు, ఇతర పూజా సామగ్రి అందజేశారు. స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా జరిగాయి. సుమారు రెండు వేల మంది మహిళలు ఈ సామూహిక వ్రతాల్లో పాల్గొన్నారు. పురోహితులు సన్నిధిరాజు విజయ్‌కుమార్ శర్మ శాస్త్రోక్తంగా మహిళలతో పూజలు చేయించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారు బంగారు చీరలో దర్శనమిచ్చారు. కేవలం పచ్చ నాయకులకు చెందిన బంధువులను ముందుగా ఆలయంలోనికి అనుమతించి, సాధారణ భక్తులను ఆలస్యంగా పంపడంపై అక్కడి మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక సంఖ్యలో మహిళలు ఆలయానికి వచ్చినా.. కనీస సదుపాయాలు లేకపోవడంతో మహిళలు క్యూలో ఇబ్బందులు పడ్డారు. స్థానిక జగన్నాథపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. వందలాది మంది మహిళలు ఈ వ్రతాల్లో పాల్గొన్నారు. ఆలయ ఈఓ ఎస్ సత్యవాణి ఆధ్వర్యంలో మహిళలకు పూజా సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. స్థానిక రామారావుపేట శివాలయంలో, జగన్నాథపురం శివాలయం, మార్కెట్‌లోని కనకదుర్గ ఆలయంతో పాటు, నగరంలో పలు అమ్మవారి ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కరపలో దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

కరప: మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రావణ శుక్రవారం పూజలను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ మాసం చివరి వారం కావడంతో మహిళలు వేకువజామునే వరలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కరప దుర్గాదేవి ఆలయంలో అర్చకులు కొంపెల్ల చక్రధర్ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు జరిగాయి. ఆలయ నిర్వాహకులు మేడిశెట్టి పెద్దకాపు, మేడిశెట్టి అప్పలస్వామి, నక్కా సత్యనారాయణ తదితరులు భక్తులకు ఏర్పాట్లు చేశారు. పెనుగుదురులోని సంతోషిమాత ఆలయానికి భక్తులు పోటెత్తారు. అర్చకులు కాదా సత్యనారాయణ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నడకుదురు, పెనుగుదురు, పాతర్లగడ్డ, గొర్రిపూడి, పెద్దాపురప్పాడు, యండమూరు, అరట్లకట్ట, వలసపాకల, వేములవాడ, వేళంగి, గొర్రిపూడి, కూరాడ తదితర గ్రామాల్లో దుర్గాదేవిని భక్తులు దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.